


# మూడో చీమ కథ

మల్లాది
వెంకటకృష్ణమూర్తి

జగదీష్ కూతురు ఆ సాయంత్రం ఇంటికి వచ్చే సరికి ఆరుంపావు దాటింది.

"ఇంతాలస్యం అయిందే?" కోపంగా అడిగాడు జగదీష్.

తండ్రిని చూసి కొన్ని క్షణాలు బిత్తర పోయింది ఆ పిల్ల. ఆ సమయంలో సాధారణంగా ఆయన ఆఫీస్‌లోనే ఉంటాడు.


"బస్ దొరకలేదు డాడీ!"

"నిజం చెప్పు." గర్జించాడు జగదీష్.

"నిజమే డాడీ! నా స్నేహితురాలు పుట్టిన రోజు ఇవాళ. వాళ్ళింటికి టీకి పిలిస్తే వెళ్ళి వస్తున్నాను. బస్‌కూడా వెంటనే దొరకలేదు."

"'రైడర్ ఆన్ ది రెయిన్' ఎలా ఉంది?" ఖంగు మంది ఆయన కంఠం.

వెంటనే ఆమె మొహం పాలిపోయింది.




"సినిమాకి వెళ్ళి వస్తూ, ఎందుకు అబద్ధం ఆడటం? ఎవ రతను?"

వెంటనే తేరుకుంది." సినిమాకా? రైడర్ ఆన్ ది రెయినా? ఎవరితోనా? నేను నా స్నేహితు రాలింటి నించి వస్తున్నాను డాడీ!"

జగదీష్‌కి కూతురు నిజం ఒప్పుకోక పోవడంతో కోపం అధికం అవుతూంది.

"ఎందు కలా బుకాయించాలని చూస్తావ్? నా కళ్ళతో నేను చూశాను మిమ్మల్నిద్దరినీ."

"ఎక్కడ? ఎవరిద్దరినీ?" అడిగిందిఆమె తండ్రిని.

"నిన్న చెక్స్‌షర్ట్‌లో ఉన్న ఆ కుర్రాడిని. సినిమా విడిచాక అతను థియేటర్‌లోంచి బయటికి వస్తున్నాడు. అతని స్కూటర్ వెనకాల పిలియన్ సీట్ మీద నువ్వు కూర్చుని ఉన్నావ్. కారులో వస్తూ చూశాను."

"నో, డాడీ! మీరు పొరబడి ఉంటారు. నేను కాదు."

"పొరబాటా? కూతుర్నే తండ్రి గుర్తు పట్టగలగడం పొరబాటా?" రెట్టించాడు జగదీష్.

"అవును."

"నాది తప్పంటావ్ కాని నిజం ఒప్పుకోనంటావ్. అంతేనా?"

"ఇంపాసిబుల్ డాడీ! నేను కాదు మీరు చూసిన వ్యక్తి."

"ఎక్కడ పార్టీ?"

"మెటిల్డా ఇంట్లో..." నాలిక కరుక్కుంది ఆమె సమాధానం చెప్పాక, తన తెలివి తక్కువతనానికి.

జగదీష్ టెలిఫోన్ దగ్గరకి వెళ్ళి దాని కింద ఉన్న డైరెక్టరీ తీశాడు. అందులో స్నేహితుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు రాసుకోడానికి కేటాయించబడ్డ కార్డుని తీసి చూశాడు. తరవాత ఒక నంబర్ తిప్పాడు.

జగదీష్ కూతురు చెప్పింది వెంటనే—"మీ రలా అడగడం బాగాలేదు డాడీ! ఏమనుకుంటుంది?"

అవతల రిసీవర్ ఎత్తాక అడిగాడు జగదీష్.

"మెటిల్డా ఉందా? మాట్లాడాలి."

జగదీష్ కూతురు లైన్‌ని కట్ చేసి చెప్పింది—అసహనంగా, కొద్దిగా భయంగా— "నిజమే. 'రైడర్ ఆన్ ది రెయిన్' చూసి వస్తున్నాను."

నెమ్మదిగా రిసీవర్ క్రెడిల్ మీద ఉంచి తన కూతురు వైపు తిరిగి అడిగాడు —

"ఎందు కిలా చిన్న విషయానికీ పెద్ద విషయానికీ అబద్ధా లాడుతావు? పట్టుబడకపోతే అబద్ధాన్ని నిజంగా చలామణి చేద్దామనా? అలా ఎదుటి వాళ్ళని ఫూల్స్ చేస్తూ ఎంత కాలం నువ్వు మీ అమ్మ ఆత్మవంచన చేసుకుంటారు. ఐ లైక్ ఫ్రాంక్‌నెస్. ఏ విషయమైనా నిర్భయంగా చెప్పచ్చుగా. అలా భయపడుతున్నావంటే తప్పు చేశావని నీ మనసుకి నీకే తెలుసన్నమాట. ఇటీజ్ డిజ్‌గ్రేస్ ఫుల్ ఆన్ యువర్ పార్ట్ టు లై."

జగదీష్ కూతురు మౌనంగా తల వంచుకుంది. జవాబు చెప్పలేదు.

"మ్యూజికల్ ఫోటో ఆల్బం మీ అమ్మ మూడు వందల అరవై పెట్టి కొన్నది. మీ మామయ్య సింగపూర్ నుంచి వస్తూ తీసుకు వచ్చాడని అబద్ధం ఆడింది. నిజం చెబితే 'అంత డబ్బు ఎందుకు తగిలేశావ్?' అని కోప్పడే వాడినేమో కాని ఉరి తీయనుగా? ఆ ఆల్బం కొన్న బిల్ దాంట్లోనే ఉంచేసింది పొరబాటున. అది నా కంట పడటంతో నిజం తెలిసింది. లేకపోతే మీ అమ్మ చెప్పిన అబద్ధాన్ని నమ్ముతూనే ఉండేవాడిని."

కుడి కాలిబొటన వేలిని నేలకి రాస్తూ మౌనంగా ఉండిపోయింది జగదీష్ కూతురు.

"ముప్పై ఏళ్ళు కాపరం చేస్తున్నాను దాంతో—ఎన్ని వేల అబద్ధాలు నమ్మించిందో నా చేత అలా." దీరంగా నిట్టూర్చాడు జగదీష్.

ఆయనకి అబద్ధాలంటే ఎంత మాత్రం గిట్టదు. దోషులు మాత్రమే అబద్ధం ఆడతా రనేది ఆయన సిద్ధాంతం. ఇంట్లో భార్య, కూతురు అబద్ధాలు ఆడే కొద్దీ వాళ్ళ మీద అసలు ఆడవాళ్ళ మీదే రోత పుడుతూంది. ఆయనకాని, ఆయన కొడుకు లిద్దరూ ఎప్పుడూ అబద్ధాలాడరు. అలాంటి అవకాశం వారికి ఎంతో ఎంతో అరుదుగా వస్తూంటుంది.

"గాస్ అయిపోవచ్చింది. వాసన వేస్తూంది. ఫోన్‌చేయండి." ఆ గదిలోకి వచ్చిచెప్పింది జగదీష్‌తో ఆయన భార్య.

భార్య వంక చూశాడు ఆయన. 'ఇది నిజమేనా?' అన్న భావం కనిపించింది జగదీష్ భార్యకి ఆయన చూపులో.

* * * *

కోపంతో కుత కుత ఉడికి పోయాడు మధు బాబు, ఆ బాంక్ పాస్ బుక్ చూడగానే. అది అతని భార్య పేరు మీద తెరవబడ్డ సేవింగ్స్ బాంక్ ఎకౌంట్ పాస్‌బుక్.

ఒకో ఎంట్రీ పరిశీలనగా చూశాడు. నాలుగేళ్ళ క్రితం కాపరానికి వచ్చిన కొత్తల్లో తెరవబడింది ఆ ఎకౌంట్. నెలనెలా నలభై నుంచి అరవై దాకా జమ చేయబడుతూంది. అందులో రెండు మూడు వందలు అవగానే పది రూపాయలు మాత్రం ఉంచి, మిగతాది డ్రా చేయబడుతూంది.

భార్యని పిలిచి అడిగాడు.

"నా కెందుకు చెప్పలేదు దీని సంగతి?" ఆ పాస్ బుక్‌ని అందించి అడిగాడు, సాధ్యమయినంత శాంతంగా.

"నా బట్టలెందుకు తీశారు బీరువాలోంచి?" అడిగింది మధుబాబు భార్య.

"ఎదురు ప్రశ్న లేయకు. చెప్పు. ఎందు కీ సంగతి రహస్యంగా ఉంచావ్?"

"నా పట్టు చీరలో ఉందా ఇది?"

"అవును."

"మీరు తెచ్చే జీతం లోనే పొదుపు చేయగలిగింది దాస్తున్నాను...తప్పా?"

"పొదుపా?" ఆశ్చర్యంగా అడిగాడు మధు బాబు.

"అవును."

"అంటే నువ్వు రాసే లెక్కలన్నీ తప్పేనన్న మాట."

నెలనెలా వచ్చే రాబడి, అయే ఖర్చు రాసే అల వాటుంది మధుబాబు భార్యకి. ఎప్పుడైనా ఆ పుస్తకం తిరగేస్తుంటాడు అతను. నెలలో మిగి లేది అయిదు, పది మాత్రమే. ఒకోసారి అది కూడా మిగలదు.

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు. ఆ సమాచారం మింగుడు పడలేదు వెంటనే.

"విత్‌డ్రా చేసిన ఈ డబ్బు ఏం చేస్తున్నావ్?" అడిగాడు.

"ఇంటికే ఖర్చు చేస్తున్నాను. నేనేం సినిమా లకి, షికార్లకి తగలెయ్యడం లేదు."

"ఇంటికే అంటే?"

"మొన్న కొన్న స్టీల్ వాటర్ జగ్‌కి డబ్బెక్కడి నించి వచ్చిందనుకున్నారు?" విసురుగా అడిగింది. ఆ ప్రశ్నలో తన రహస్యం బయటపడిందన్న కోపం. స్పష్టంగా అర్థమైంది మధుబాబుకి.

"అది మా అన్నయ్య వార్ధా నుంచి వస్తూ తెచ్చా డన్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు మధు బాబు.

"ఊహూ. నేను వూరికే అలా చెప్పానంతే!"

''ఎందుకు వూరికే అలా చెప్పావ్?'' కోపంగా తన భార్య మాటలని వెక్కిరింపుగా అనుకరిస్తూ అడిగాడు మధుబాబు.

''మా అన్నయ్య తెచ్చాడంటే ప్రెస్టేజిగా ఉంటుందని!'' కోపంగా చెప్పింది.

''ఓ. అదన్నమాట.''

''అవును... అదే!''

''అయితే, మీ నాన్నగారు కొనలేదన్న మాట ఆ గోడ గడియారం?''

''వూహూ.''

''అంటే పోయిన ఉగాదికి మీ నాన్న గోడ గడియారం కొనమని డబ్బు పంపటం నిజం కాదన్న మాట?'' కసిగా అడిగాడు మధుబాబు.

''కాదు.''

''ప్రెస్టేజి కోసం — కేవలం నీ పుట్టింటివాళ్ళ ప్రెస్టేజి కోసం ఇలా అబద్ధాలాడి, నా సంపాదనలో రహస్యంగా నాకు తెలియకుండా అబద్ధాలాడి దాచిన డబ్బుతో కొన్నావన్న మాట ఈ సామానంతా?''

''అవును. మీ రిస్ట్ వాచ్ ప్రెస్టేజ్ తప్ప. దాన్ని నిజంగానే మా తమ్ముడు తెచ్చాడు మీ కోసం.''

''బోడి రిస్ట్‌వాచ్ ప్రెస్టేజ్. అయిదు కూడా చెయ్యదది.''

''ఎంతో కొంత... వాడి శక్తికి మేర వాడు తెచ్చాడు.''

''సంపాదన నాది. క్రెడిట్ మీ నాన్నది. వచ్చి అబద్ధాల కోరివి నువ్వు.'' అరిచాడు.

''నేనేం మీ సొమ్ము పాడు చేయలేదు. ఎందుకలా గొంతు చించుకుంటారు?''

''షటప్. ఇంక మాట్లాడకు.''

''పక్కవాళ్ళని పిలిచి ఎవరినయినా అడగండి.. నేను చేసిన దాంట్లో తప్పేదైనా ఉందేమో?''

''ఐ సెడ్ షటప్. నేను ఇంటర్వ్యూకి వెళ్తున్నాను. నా మూడ్ పాడు చెయ్యకు.'' కోపంగా చెప్పాడు మధుబాబు.

అతని భార్య ఏదో అనబోయి ఆగిపోయింది.

''డామిట్. మీ వాళ్ళు కొన్నారా వీటిని? ఎలా నమ్మించావు ఇంతకాలం? ఐ హేట్ ఇట్.''

''పదండి... టైం అయింది. నేను ఎదురు రానా?'' అడిగింది.

''వద్దు. అబద్ధాల కోర్లు ఎదురు రాకూడదు నాకు ఈ ఉద్యోగం రావాలంటే.'' చెప్పాడు మధుబాబు.

* * * *

''మీ పేరు?'' అడిగాడు జగదీశ్.

''మధుబాబు, సర్!''


''ప్రస్తుతం ఎక్కడ చేస్తున్నారు?''

''బరోడా కెమికల్స్ లిమిటెడ్‌లో స్టెనోగ్రాఫర్, సర్!''

''జీతం ఎంత అక్కడ?''

''ఎనిమిది వందలేభై, సర్!''

''ఎందుకు మా కంపెనీకి మారాలనుకుంటున్నారు?'' అడిగాడు జగదీష్.




''ఫర్ బెటర్ ప్రాస్పెక్ట్స్, సర్!''

రొటీన్ ప్రశ్నకి అది రొటీన్ సమాధానం.

''ఎంత జీతం ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు?''

జగదీష్ మనసు ఇంటర్వ్యూ మీద లేదు. అసలు దేని మీదా లేదు. తన భార్య, కూతురు అబద్ధం ఆడటంతో చిరాకుగా ఉంది. అతనిమొహంలో, కంఠస్వరంలో చిరాకు స్పష్టంగా కనపడుతూంది.

మధుబాబు తనని ఇంటర్వ్యూ చేసే జగదీష్ అన్యమనస్కంగా ఉండటం గ్రహించాడు. అతని మనసుకూడా సరిగ్గా అదే స్థితిలో ఉంది. భార్య మీద కోపం ఇంకా పోలేదు. ఎందుకు అబద్ధాలాడాలి?

''నా ప్రశ్నకి సమాధానం లేదా?'' అడిగాడు జగదీష్, మధుబాబు మౌనంగా ఉండటంతో.

మధుబాబు జవాబు చెప్పేలోగా మరో ప్రశ్న అడిగాడు.

''మూడు చీమలు ఒక దాని వెనుక మరొకటి వెళుతున్నాయి. మొదటి చీమతో రెండో చీమ చెప్పింది. 'నా వెనక ఒక చీమ ఉంది'. రెండో చీమతో అంటే మధ్య చీమతో చివర ఉన్న మూడో చీమ చెప్పింది—'నా వెనకకూడా ఇంకో చీమ ఉంది.' ఆ మూడో చీమ ఎందుకలా చెప్పింది?''

''పార్డన్ మి, సర్?'' అడిగాడు మధుబాబు.

''మూడు చీమలు ఒక దాని వెనుకే మరొకటి వెళుతున్నాయి. రెండో చీమ మొదటి చీమతో 'నా వెనక ఒక చీమ ఉంది' అని చెప్పింది. అది నిజమేనా?'' అడిగాడు జగదీష్.

''కరెక్ట్, సర్!'' ఆలోచించి చెప్పాడు.

మూడో చీమ ఆ తరవాత రెండో చీమతో చెప్పింది. 'నా వెనకకూడా ఒక చీమ ఉంది.' అది నిజమేనా?''

''అబద్ధం, సర్! అబద్ధం చెప్పింది మూడో చీమ''.

''కాదు. నిజమే చెప్పింది! ఎలా?''

''కాదు, సార్! మూడో చీమ వెనకాల నాలుగో చీమ లేదుగా? కాబట్టి అది అబద్ధం చెప్పింది.''

''ఎందుకు అబద్ధం చెప్పింది?''

ఇదేదో సైకాలజీకి చెందిన ప్రశ్నలా ఉంది అనుకున్నాడు మధుబాబు. కొన్ని క్షణాలు ఆలోచించాడు. ఇంకా భార్య మీద కోపం పోవడం లేదు.

''కారణం ఉంది, సర్!'' చెప్పాడు చిన్నగా నవ్వి.

''ఏమిటా కారణం?'' అడిగాడు జగదీష్.

''ఆ మూడో చీమ ఆడచీమ కాబట్టి.''

''ఆడచీమ? అయితే?'' ఆ ప్రశ్నకి కొత్త సమాధానం మొదటిసారిగా విన్నాడు జగదీష్.

''మొదటి రెండు చీమలూ మగ చీమలు. కాబట్టి అబద్ధం ఆడవు. వాటి వెనకాల ఉన్న మూడో చీమ ఆడచీమే. ఆడది కాబట్టి అబద్ధాలాడటం దాని సహజ ప్రవృత్తి.'' భార్యని గుర్తు తెచ్చుకుని చెప్పాడు మధుబాబు.

జగదీష్‌కి ఆ సమాధానం బాగా నచ్చింది. ఆయనకి తన భార్య, కూతురు గుర్తుకు వచ్చారు వెంటనే.

''యు ఆర్ రైట్, మిస్టర్!'' మెచ్చుకోలుగా చెప్పాడు.

మధుబాబు తనని ఇంటర్వ్యూ చేసే జగదీష్ నవ్వుకోవడం గమనించాడు.

''మూడో చీమ మగ చీమ అయితే అది చెప్పింది కరెక్టేనా?'' నవ్వుతూ అడిగాడు జగదీష్.

''కరెక్టే, సార్!'' స్థిరంగా చెప్పాడు మధుబాబు.

''ఎలా మూడో చీమ వెనక నాలుగో చీమ లేనప్పుడు ఉందని ఆడచీమ చెప్పినా, మగ చీమ చెప్పినా నిజం ఒక్కటేగా.''

''మగవాళ్ళు... ఐ మీన్ మగ చీమ ఎప్పటికీ అబద్ధం ఆడదు, సర్! ఆ మూడు చీమలు గుండ్రంగా ఒక సర్కిల్‌లో ప్రయాణిస్తున్నాయి. అప్పుడు మూడో చీమ వెనకాల నాలుగో చీమ లేకపోయినా మొదటి చీమే ఉంటుంది, సర్! దాంతో మూడో చీమ వెనకాలకూడా ఒక చీమ ఉన్నట్లే—ప్రతీ మగచీమ వెనకాల మరో మగ చీమ ఉండి తీరుతుంది, సర్!''

జగదీష్‌కి మధుబాబు సమాధానం నచ్చింది.

''యు ఆర్ రైట్ ఎగైన్!'' చెప్పాడు జగదీష్ మెచ్చికోలుగా.

మధుబాబు క్వాలిఫికేషన్, మిగతా వివరాలు ఫైల్‌లో ఈ సారి జాగ్రత్తగా చూసి అడిగాడు జగదీష్.

''ఇది ఆఖరి ప్రశ్న. ఎంత జీతం ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావు?''

''వెయ్యి, సర్!''

''యు కెన్ గో నౌ. థాంక్స్ ఫర్ యువర్ ఇంట్రెస్ట్ ఇన్ అవర్ కంపెనీ.''

''థాంక్యూ, సర్!''

మధుబాబు లేచి బయటికి నడిచాడు. ఆ తరవాత వచ్చిన అభ్యర్థులని ఎక్కువ ప్రశ్నలతో విసిగించలేదు జగదీష్.

మధుబాబుకుపది రోజుల తరవాత పోస్ట్‌లో వెంటనే వచ్చి జాయిన్ అవమని ఉత్తరం వచ్చింది.

జగదీష్ సంతకం ఉంది ఆ ఉత్తరం మీద.

*